# ప్రయాణం ఆగిపోయింది

బైరాగి పట్టాలకడ్డంగా పడుకున్నాడు. ముందు రెండు పట్టాల మధ్యా ముడుచుకు పడుకున్నాడు. అది లాభం లేదనుకుని, లేచి, మెడ ఒక పట్టా మీద, పాదాలొక పట్టామీదా పెట్టి పడుకున్నాడు. ఆవిధంగా పడుకోడం చాలా ఇబ్బందిగా వుంది. లేచి, పట్టాల మధ్య చెక్కల మీద చతికిలబడి కూచున్నాడు.

బండి రావడానికింకా కనీసం పావుగంట పడ్తుంది. తను స్టేషన్ నించి బయల్దేరేసరికి మూడైందన్నారు. బండి మూడున్నరకి బయల్దేరుతుందన్నారు. తను స్టేషన్నించి ఇక్కడికి చేరుకోడానికి ఒక పావుగంట పట్టి వుంటుంది. బండి స్టేషన్లో బయల్దేరి, ఔటర్ సిగ్నల్ దాటి మలుపు తిరిగి ఇక్కడికి చేరుకోడానికి ఐదారు నిమిషాలైనా పడ్తుంది. ఈ నిరీక్షణ దుర్భరంగా వుంది. బండి కోసం, చావు కోసం నిరీక్షణ.

అసలు రాత్రే చచ్చిపోదామనుకున్నాడు బైరాగి. కాని చివరి బండి తొమ్మిదిన్నరకే వుంది. ఆ సమయంలో ఎవరో ఒకరు తిరుగుతూనే వుంటారు. చూస్తే చావనివ్వరు. చావనివ్వరు... బ్రతకనివ్వరు. బ్రతికినంతకాలం చంపుతూనే వుంటారు... మోసాలు. దగాలు. దోపిడీలు... తడిగుడ్డతో గొంతులు కొయ్యడాలు... బైరాగికి మనుషులందరి మీదా కోపమొచ్చింది. కాని వెంటనే –

"ఎవరెట్టా చస్తే నాకేం? చావబోయే వాడికింకా ఈ మనుషుల్తో నాకేం పని" అనుకున్నాడు.

మరికొద్ది నిమిషాల్లో తనకీ లోకంతో ఋణం తీరిపోతుంది. బాధల్నించి, భయాల్నించి శాశ్వతమైన విముక్తి లభిస్తుంది. తెల్లవారాక తునాతునకలైపోయిన తన శవాన్ని చూసి అంతా ఏమనుకుంటారో? అయ్యో పాపం అనుకుంటారేమో! తను చచ్చి పోయినందు కేడ్చేవాళ్ళెవరూ లేరు. తన కసలు నా అన్నవాళ్ళెవరూ లేరు.

బైరాగి పక్కనుంచి, అతన్ని రాచుకుంటూ ఏదో పాకిపోయింది. ఉలిక్కిపడ్డాడు. వొళ్ళు జలదరించింది. చీకట్లో ఏం కనపడలేదు. పామేమో అనుకున్నాడు. భయం తగ్గాక నవ్వొచ్చింది. చచ్చేవాడికి పామైతే మాత్రం భయమెందుకనుకున్నాడు.

కాలినేదో గట్టిగా పీకింది. "అబ్బా" అనుకుంటూ అక్కడ తడిమి చూశాడు. గండుచీమ చేతికి దొరికింది. కసిగా దాన్ని నలిపేశాడు.

గొంతుక ఎండిపోయినట్టూ, నాలుక పిడచగట్టుకుపోయినట్టూ అనిపించింది. లేచి, పక్కనే వున్న పంటబోదెలో కెళ్ళి నీళ్ళు తాగాడు. నీళ్ళు మురికిగా వున్నాయి. కాలు జారి బోదెలో పడ్డాడు. బట్టలు తడిసిపోయాయి. "ఏం లాభం? ఇందులో పడినా చావంగా!" అనుకున్నాడు.

బోదె కావల తోటనిండా చెట్లు నిద్రపోతున్నాయి. చెట్ల నిండా పక్షులు నిద్రపోతున్నాయి. ఇంకా లేవలేదు. కీచురాళ్ళు మాత్రం ఇంకా కూస్తూనే వున్నాయి. అవసానదశలో వున్న అర్ధచంద్రుడి మసక వెన్నెల బాగా అరిగిన పట్టాల మీద పడి మెరుస్తోంది.

బైరాగి జేబులో మిగిలిన ఆఖరి బీడీ, అగ్గిపెట్టే తీశాడు. పెట్టెలో రెండే పుల్లలున్నాయి. తడిసిపోయి రెండూ వెలగలేదు. ఖాళీ అగ్గిపెట్టే, బీడీ దూరంగా విసిరేశాడు. తడిసిన బట్టలు వొంటి కతుక్కుని చలిగా, చిరాగ్గా వున్నాయి. ఇంకెంత సేపులే ఈ బాధలన్నీ.. అనుకున్నాడు. మళ్ళీ పట్టాల కడ్డంగా మెడ ఒక పట్టామీద పాదాలొక పట్టా మీద పెట్టి, బోర్లా పడుకున్నాడు.

రైలు కూత బిగ్గరగా, భయంకరంగా వినిపించింది. బైరాగి గుండెలవిసి పోయాయి. రైలు బయల్దేరిన శబ్దం. బయల్దేరి వస్తూన్న శబ్దం. బైరాగి ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. పళ్ళు బిగపట్టాడు. రైలు ఇంకా ఇంకా దగ్గర కొస్తున్న చప్పుడు... మరి కాస్సేపట్లో మలుపు తిరిగి వచ్చి తన మీదుగా వెళ్ళిపోతుంది.

రైలు మలుపు తిరక్కముందే ఆగిపోయింది. ఎందుకనో అర్థం కాలేదు బైరాగికి, ఆగిపోయిందని నిర్ధారణైన తర్వాత, పట్టాలమీంచి లేచి అటుకేసి వెళ్ళాడు. మలుపుకి వంద గజాలవతలే రైలాగిపోయింది. రైలు ముందు గుంపులు గుంపులుగా జనం. బైరాగి జనంలోకి జొరపడ్డాడు. ఇంజిను ముందు, పట్టాల మీదా పట్టాల మధ్య రక్తపు మడుగు. ఎవరిదో తలా మొండెం వేరయిపోయి నజ్జు నజ్జయిపోయిన శరీరం. "ఎవరో పాపం! దురదృష్టవంతుడు" అనుకుంటున్నారు జనం.

తనది అదృష్టమో, దురదృష్టమో బైరాగి కర్థం కాలేదు.

O

*('కేకలు' దీపావళి ప్రత్యేక సంచిక: –7 నవంబర్ 1975)*